www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 6 నవంబర్ 2023
5
అన్నమయ్య



నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం – స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్–ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిజెపి ప్రభుత్వానికి మద్దతిస్తూ వైసిపి, టిడిపి, జనసేనలు రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు, రాజకీయాలు చేస్తున్నాయని, వాటిని ప్రజలందరూ తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. ఈనెల 15న విజయవాడలో నిర్వహించబోయే ప్రజారక్షణ భేరి బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా, దళిత, గిరిజన వ్యతిరేక రాజకీయాలను వైసిపి, టిడిపి, జనసేనలు బలపరుస్తు న్నాయ న్నారు. వాటిని ప్రజలకు వివరించడమే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజారక్షణ యాత్ర సిపిఎం నిర్వహి స్తున్నట్లు తెలిపారు. దళితులు, గిరిజనుల హక్కులను హరించేలా పార్లమెంటులో చట్టాలు చేస్తున్న బిజెపికి వైసిపి, టిడిపిలు సంపూర్ణంగా మద్దతు ఇస్తూ రాష్ట్రంలో మోసపూరిత రాజకీ యాలు చేస్తున్నాయని తెలిపారు. పార్లమెంటులో మద్దతిస్తూ రాష్ట్రంలో సాధికార యాత్రలు చేయడ మేంటని ప్రశ్నించారు. వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రలో మంత్రుల ఉపన్యాసాలు వింటు ంటే హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఒకవైపు సామాజిక న్యాయాన్ని సంహరిస్తూ మరోవైపు తామే కాపాడుతున్నామంటూ ఊరేగింపులు, సంబరాలు చేస్తూ సాధికారితను అపహాస్యం చేశారన్నారు. ఉపాధి హామీ పనులకు కోతలు విధించారని, బడ్జెట్లో నిధులు తగ్గించారని, దీనికి వైసిపి మద్దతు తెలిపిందని చెప్పారు. పనికి ఆహార పథకం మీద ఆధారపడేది ఎక్కువమంది దళితులు , పేదలేనని వివరించారు. రాష్ట్రాల హక్కులను హరించే కేంద్రం లోని బిజెపి చర్యలను ఏమాత్రం ప్రతిఘ టించకుండా, అడుగడుగునా రాజీ పడుతున్న వైసీపి సామాజిక సాధికారత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపికి మద్దతుగా నిలుస్తున్న వైసిపి తెలుగుదేశం జనసేనలను నిలువరించాలని ప్రజారక్షణ భేరి విజయవాడలో జరుగుతోందని ఈ సభకు సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు హాజరవుతున్నాని ప్రజలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, నాయకులు హరిశర్మ, ప్రభాకర్ రెడ్డి, వెంకట్రామయ్య, సోమశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

అగ్ని ప్రమాదాలను నివారించడమే లక్ష్యం

జిల్లా అగ్నిమాపక అధికారి టి. అనిల్ కుమార్

ప్రజాశక్తి -రాయచోటి



ముఖా ముఖి..

జిల్లాలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ అగ్ని ప్రమాదాలను నివారించడమే తమ లక్ష్యమని జిల్లా అగ్నిమాపక అధికారి టి. అనిల్ కుమార్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రాబోయే దీపావళి పండగ సందర్భంగా ప్రమాదాలను చోటు చేసుకోకుండాఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో అగ్నిమాపక కేంద్రాల వివరాలు తెలపండి?

జిల్లాలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, రైల్వే కోడూర్, పీలేరు, వాల్మీ కిపురం, మదనపల్లె ,ములకలచెరువు ప్రాంతాలలో అగ్నిమాపక కేంద్రాలున్నాయి 8 వాహనాలు,1 జీపు,1బుల్లెట్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

జిల్లాలో బాణాసంచా ఫ్యాక్టరీలు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో 24 లైసెన్స్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. రాయచోటిలో 10, లక్కిరెడ్డిపల్లెలో 3, రాజంపేటలో 2, రైల్వే కోడూరులో 2, వాల్మీకిపురంలో 1, పీలేరులో 3,మొలకలచెరువులో 1, మదనపల్లె 2 చొప్పున బాణా సంచా ఫ్యాక్టరీలున్నాయి.

ఫైర్ ఆఫీసర్లు పని వివరాలు తెలపండి?

ఫైర్ ఆఫీసర్లు వివిఐపి స్టాండ్ బై, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, గవర్నర్, జెడ్ ప్లస్ కేటగిరి తదితర స్టాండ్ బై డ్యూటీకి హాజరవుతారు. ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహించడం, 24 గంటలు ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండడం, పెట్రోల్ బంక్, గ్యాస్ గోడెన్ సినిమా థియేటర్లు పాఠశాలలో ఆసుపత్రులు ఫ్యాక్టరీలకు అగ్నిమాపక శాఖ వారు ఎన్ఒసి సర్టిఫికెట్ మంజూరు చేయడం జరుగుతుంది.

ఫైర్ మేన్‌లకు ఎలాంటి శిక్షణలు ఇస్తారు?

ఫైర్ మెన్‌లు అగ్ని మాపక కార్యాలయంలో విధుల్లో చేరేటప్పుడు నాలుగు మాసాల పాటు శిక్షణ ఇస్తారు. స్విమ్మింగ్ శిక్షణ తర్వాత గోవా, బెంగళూరు, ఒరిస్సా ప్రత్యేక శిక్షణకు పంపిస్తారు. నాగపూర్‌లో ట్రైనింగ్ ఇస్తారు.

దీపావళి పండుగ సందర్భంగా ఎన్ని షాపులకు అనుమతులు ఇస్తున్నారు?

దీపావళి పండుగ సందర్భంగా జిల్లా వ్యాపతంగా తాత్కాలికంగా 330 దరఖాస్తులు వచ్చాయి. వన్ మెన్ కమిటీ ప్రకారం స్థానిక తహశీల్దార్, పోలీస్ స్టేషన్, ఎపి ఎస్‌పి డిసిఎల్ , ఫైర్ సిబ్బంది గ్రౌండ్‌ను ఎంపిక చేస్తాం. వీరు నిర్దేశించిన గ్రౌండ్‌లో షాపులను ఏర్పాటు చేసుకోవాలి. షాపులను ఐరన్ రేకులతో ఏర్పాటు చేసుకోవాలి ప్రతి షాప్‌కూ మూడు మెటర్లు దూరం ఉండాలి. ఎదురు ఎదురుగా ఉండకూడదు. ప్రతిషాపు నందు రెండు ఫైర్ సిలిండర్లు, రెండు వాటర్ డ్రమ్ములు తగినంత ఏర్పాటు చేసుకోవాలి. నో స్మోకింగ్ బోర్డును ఏర్పాటు చేసుకోవాలి. పార్కింగ్ స్థలం దూరంలో ఏర్పాటు చేసుకోవాలి.

టపాసులు పేల్చే సమయంలో ప్రజలకు మీర్చే సలమాలు, సూచనలు?

టపాకాయల ప్యాకెట్ మీద రాసి ఉన్న జాగ్రత్తలు కచ్చితంగా పాటించవలెను. టపాసులు కాల్చే సమయంలో నీటి బకెట్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. టపాకాయలను విశాలమైన మైదానంలో కాల్చాలి. పూరిగుడిసెలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లో కాల్చరాదు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలి. ప్రజలందరూ సుఖ సంతోషాలతో దీపాల పండుగ జరుపుకోవాలి.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా 8 ఫైర్ స్టేషన్లు ఉండగా ఆరుగురు ఫైర్ ఆఫీసర్లు ఉన్నారు. 2 ఖాళీగా ఉన్నాయి. డ్రైవర్ ఆపరేటర్ పోస్టులు 24 ఉండగా 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫైర్ మాన్లు 72 మంది ఉండగా 33 మంది ఉన్నారు. 39 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 22 మంది హెూంగార్డ్లు ఉన్నారు.

రాబోయే ఎన్నికల్లో వైసిపి పతనం తప్పదు

జనసేన రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్ చౌదరి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాబోయే శాసనసభ ఎన్నికల్లో జనసేన – టిడిపి కూటమి ప్రభంజనం సృష్టించడం ఖాయమని, వైసిపి పతనం తప్పదని జనసేన పార్టీ రాయలసీమ కో–కన్వీనర్ గంగారపు రాందాస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని నక్కలదిన్నె తాండా, పప్పిరెడ్డిగారిపల్లెలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, పట్టణ ప్రధాన కార్యదర్శి గండికోట లోకేష్ ,రూరల్ ప్రధాన కార్యదర్శి జంగాల గౌతమ్ ఆధ్వర్యంలో జనంలోకి జనసేన పట్టణబాట, పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గంగారపు రాందాస్ చౌదరికి నక్కలదిన్నె యువత, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంగారపు రాందాస్ చౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిసారీ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ను విమర్శించడం పరిపాటి అయిపోయిందన్నారు. జనసేన – టిడిపి కూటమితో వైసిపికి కునుకు లేకుండా పోయిందన్నారు. ప్రతిపక్షాలను విమర్శించడం మాని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. అనంతరం జంగాల శివరాం రాయల్ మాట్లాడుతూ వైసిపిపాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎపి అభివృద్ధి పథంలో పయనించాలంటే జనసేన – టిడిపి కూటమి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, జిల్లా జాయింట్ సెక్రటరీ సనావుల్లా, టౌన్ ప్రెసిడెంట్ నాయని జగదీష్, రూరల్ మండలం అధ్యక్షులు గ్రానైట్ బాబు, రామసముద్రం మండలం అధ్యక్షులు చంద్రశేఖర్, ఐటి విభాగ నాయకులు కల్లూరు లక్ష్మినారాయణ, చందు, జియో మదనపల్లి డీలర్ చంద్రమోహన్, ఆదర్శ్ పాల్గొన్నారు.


పల్లెబాట కార్యక్రమంలో జనసేన నాయకులు

వంతెన పనులు పరిశీలించిన ఎమ్మెల్యే 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని భువనగిరిపల్లెలో నిర్మిస్తున్న వంతెన పనులను ఆదివారం శాసనసభ్యులు మేడా మల్లిఖార్జున రెడ్డి పరిశీలించారు. ఎంతోకాలంగా వర్షాకాలం సమీపిస్తే అలుగు నీరు, వరద నీరు గ్రామానికి సమీపంలో వరదలా ప్రవహించి గ్రామానికి, బయటి సమాజానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. ఇలాంటి తరుణంలో మేడా మల్లికార్జునరెడ్డి రాజ్యసభ నిధులు, డిఎంఎఫ్ నిధుల రూ. 25 లక్షలతో వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు పూర్తిగా వస్తున్న వంతెనను ఆదివారం ఆయన భువనగిరి పల్లె గ్రామానికి వెళ్లి ప్రత్యేకంగా పరిశీలించారు. వర్షాకాలంలో తాము ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన మేడా మల్లిఖార్జున రెడ్డిని గ్రామస్తులు ఈ సందర్భంగా గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు నాగా పృథ్వీపతిరెడ్డి, ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ డిఇ రవిశంకర్, మాజీ సర్పంచులు ఎం.ఎల్ నరసయ్య, ఎం.ఎల్ నారాయణ, నృసింహస్వామి ఆలయ ధర్మకర్తలు కంబాయి గారి నరసింహులు, నల్లంశెట్టి రఘుపతి, కంబాయిగారి హరీష్, కంబాయి గారి శివయ్య, కావేరి గారి వెంకటరమణ, కె.ఎస్ నరసింహ, ఏనుగుల మల్లి, కుందా నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కాసారపు వెంకటసుబ్బయ్య, బండ్ల నరసింహులు, కంబాయి గారి నరసయ్య పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు


సజ్జనార్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు

వీరభద్రుడి సేవలో టిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటిలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రుడి స్వామి ఆలయాన్ని టిఎస్ఆర్‌టిఎస్ ఎమ్‌డి వి.సి సజ్జనార్ ఆదివారం ఉదయం సందర్శించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించడంతో పాటు, స్వామివారి ప్రతిమను సజ్జనార్‌కు వివరించారు. వీరభద్రుడి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చూస్తే చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ అభివృద్ధికి తోడ్పడిన రాష్ట్రం ప్రభుత్వానికి , స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డికి, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మన రాష్ట్రం నుంచి కాక ఇతర రాష్ట్రాల నుండి స్వామి వారి దర్శ నానికి వచ్చిన భక్తులకు అన్నదానంతో పాటు వసతి సౌకర్యాలను కల్పించడం చాలా సంతోషం అన్నారు. అనంతరం ఆయన్ను ఆలయ ఛైర్మన్ పొలం రెడ్డి విజయమ్మ, ఆలయం ఇఒ డి.వి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ దశరథ రామిరెడ్డి సన్మానించి, స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు.

కాంగ్రెస్ పార్టీలోకి 50 మంది యువత చేరిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున యువత కాంగ్రెస్ పార్టీలో చేశారు. సుమారు 50 మంది యువకులను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో షేక్ రెడ్డి సాహెబ్ వారిని కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు మాజీ కౌన్సిలర్ మీనా కుమారి, మండల నాయకులు వై.సురేంద్రరెడ్డి, మైనార్టీ నాయకులు డాక్టర్ ఎస్.కె బాషా, మహబూబ్ పీర్, మహమ్మద్ అలీ, మహమ్మద్ రఫి,పవన్ కుమార్ రెడ్డి, అల్లాబక్షు, నిమ్మనపల్లి నాయకులు ముబారక్ ఖాన్, ఖాషీంవల్లి, గుల్షన్, రాజకుర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ యువ తకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే అది కాంగ్రెస్ పార్టీతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ,ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటు పరం చేస్తుందని విమర్శించారు. తద్వారా యువత ఉపాధి అవకాశాలను కోల్పోయి నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతుందని గుర్తు చేశారు. ఈ నిర్ణయాలను యువత ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని వెల్లడిం చారు. 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని, ఇందుకు త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోను కాంగ్రెస్ అధికారం చేపట్టబోతోందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.


యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

మహా పాదయాత్రను జయప్రదం చేయండి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎంఆర్‌పిఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 11న నిర్వహించబోయే విశ్వరూప మహాపాదయాత్రను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు చేమూరు వెంకటేష్, మందా శ్రీనివాసులు, ఎంఇఎఫ్ నాయకులు బిసి శేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ పరిధిలోని డిబిఎన్ పల్లెలో విశ్వరూప మహాసభకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సి ఉమ్మడి రిజర్వేషన్ వల్ల దశాబ్దాలుగా విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాలలో తీవ్రంగా నష్టపోయిన మాదిగలు, ఉపకులాల పక్షాన నిలబడి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయాలని ఎంఆర్‌పిఎస్ 20 సంవత్సరాలుగా ఉద్యమిస్తోందన్నారు. 2000 సంవత్సరం ప్రారంభం నుంచి 2004 నవంబర్ 5 వరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారని చెప్పారు. వర్గీకరణ జరిగిన నాలుగేళ్లలోనే మాదిగ, ఉప కులాల విద్యార్థులకు విద్యారంగంలో ఉన్నత విద్యా అవకాశాలు రావడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ రంగంలో వేలాది ఉద్యోగాలు లభించాయని తెలిపారు. అప్పుడప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న సమయంలో అభివృద్ధికి అడ్డుపట్ట వేస్తూ కొంతమంది స్వార్థపర శక్తులు సాంకేతిక కారణాల సాకుతో సుప్రీం కోర్టు ద్వారా ఎస్సీ రిజర్వేషన్ ను 2004 నవంబర్ 5 న అడ్డుకట్ట వేశారని అన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో మాదిగ, ఉప కులాల విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు మదనపల్లి పెంచలయ్య వడ్డెర, ఎంఆర్‌పిఎస్ నాయకులు జడ శివ, టి.చంద్రశేఖర్, కత్తి రమేష్, హరినాథ్, టి. నరసింహులు, ఎం.నరసింహులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు


బాధితుడికి సామగ్రి అందజేస్తున్న మలిశెట్టి వెంకటరమణ

వరద బాధితుడికి సామగ్రి వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తొగురుపేట రామచంద్రపురానికి చెందని చెయ్యేరు వరద బాధితుడు శివారెడ్డికి జనసేన పార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ ఆదివారం రూ. 30 వేలు విలువచేసే ఇంటి సామగ్రి వితరణ చేశారు. కొయ్య సామాగ్రితో పాటు సిమెంట్ బస్తాలకు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మలిశెట్టి మాట్లాడుతూ జవాద్ తుఫాను సమయంలో అన్నమయ్య డ్యామ్ తెగిపోయి సర్వం కోల్పోయిన పరివాహక ప్రాంత ప్రజలకు సాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. నేటికీ అనేకమంది వరద బాధిత ప్రజలు గుడారాలలోనే జీవనం సాగి స్తున్నారని, మరికొందరు దాతల సహాయంతో ఇంటి నిర్మాణాలు చేపడు తున్నారని తెలిపారు. అలాంటి వారికి అండగా జనసేన పార్టీ తరపున నేడు తన వంతు సహాయం అందిస్తున్నానని చెప్పారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజల కష్ట–నష్టాలను తెలుసుకొని వారికి చేయూతనందించడంలో తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. కొత్తూరు వీరయ్య ఆచారి కిటికీలు, దాలు మందరాలు నిర్మించి ఉచితంగా చేయించి తన దాతృత్వాన్ని చాటుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, పోలిశెట్టి శ్రీనివాసులు, వీర మహిళలు పాల్గొన్నారు.

టిడిపి నాయకులను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చెయ్యేరు వరద బాధితుల పరామర్శ కోసం ఆదివారం టిడిపి పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి తలపెట్టిన కార్యక్రమాన్ని రాజంపేట పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. జవాద్ తుఫాన్ సమయంలో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వల్ల నేలమట్టమై సర్వస్వం కోల్పోయిన పరివాహక ప్రాంత ప్రజలను పరామర్శించి వారికి అండగా నిలబడేందుకు ఆదివారం గంటా నరహరి శ్రీకారం చుట్టారు. జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో ఇదే రోజున ఉచిత ఆర్థో మెడికల్ క్యాంపు నిర్వహిస్తుండడం, ఈ క్యాంపుకు ప్రముఖ నేతలు హాజరవుతున్న నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకూడదు అన్న ఉద్దేశంతో గంట నరహరిని పోలీసులు అడ్డుకున్నారు. ఆయన ససేమిరా అనడంతో టిడిపి నాయకులకు, పోలీసులకు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో టిడిపి నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు గంట నరహరిని పోలీసులు అదుపులోకి తీసుకొని అర్బన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


గంటా నరహరిని అరెస్టు చేస్తున్న పోలీసులు

వాల్మీకి బోయలకు ఇచ్చిన హామీ ఏమైంది?

- విఆర్ఎస్ఎస్ అధ్యక్షులు పొదల నరసింహులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలోని వాల్మీకి బోయలకు సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని విఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు ప్రశ్నించారు. ఆయన ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ సాధనకై పార్లమెంటులో బిల్లు పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈ నెల 13న స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి వాల్మీకి సర్కిల్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తామన్నారు. కార్యక్రమానికి పెద్దఎత్తున వాల్మీకి సోదరులు తరలివచ్చి ఐక్యతను చాటి చెప్పడంతోపాటు తమ గళాన్ని గట్టిగా వినిపించాలని కోరారు. ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ లోపు వాల్మీకి బోయల ఎస్టి రిజర్వేషన్ రాష్ట్రంలో అమలులోకి తీసుకు రావాలని కోరారు. ఇందుకోసం కేంద్రంపై ఒత్తిడి చేసి అమలుకు కృషి చేయాలన్నారు.ఎన్నికల సమయంలో వాల్మీకి బోయల ఓటుబ్యాంకు కోసం ప్రయత్నాలు చేయవద్దని హితవు పలికారు. రాజకీయ స్వార్థానికి రాష్ట్రంలో వాల్మీకిబోయలను అగ్రవర్ణాల దేగకన్ను పడటంతో రెండువర్గాలుగా విడదీసి నేటికీ తమ ఓటు బ్యాంకుతో గద్దెనెక్కుతున్నారని విమర్శించారు. రాజకీయ పార్టీలు, నాయకులు అధికారం కోసం చేస్తున్న కుయుక్తులు ఇప్పటికైనా ఆపాలన్నారు. పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే ఎపిలో 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందు సంక్రాంతిలోపు కేంద్రంపై ఒత్తిడి చేసి వాల్మీకి బోయలకు గిరిజన జాతిగా గుర్తింపున కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొగ్గిటి కృష్ణ మూర్తి, మహిళా జిల్లా అధ్యక్షురాలు మేసా మాలతీ, నియోజకవర్గం ఉపాధ్యక్షులు గౌరమ్మ, కాటినేని సూరి, కృష్ణ మూర్తి, చలపతి, విజయ్ కుమార్, సుబ్బు, నిమ్మనపల్లి మండలం అధ్యక్షులు మల్లేశ్వర స్వామి, నరసింహులు, శ్రీరాములు,తేజ, మంజునాథ్ పాల్గొన్నారు.


ఐక్యతను చాటుతున్న వాల్మీకి బోయ కులస్తులు

చదరంగం పోటీకి 'మిట్స్' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఇసిఇ చివరి సంవత్సరం చదువుతున్న మణికంఠేశ్వర్ రెడ్డి చదరంగం లో జెఎన్‌టియు అనంతపురం ఇంటర్ యూనివర్సిటీ సెలక్షన్‌లో యూనివర్సిటీ టీంకు ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. కావలిలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన చదరంగం ఎంపికల్లో ప్రతిభ కనపరిచి యూనివర్సిటీ టీం కు ఎంపికయ్యాడని చెప్పారు. తమిళనాడులోని భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో పాల్గొంటారని ఆయన అన్నారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల,కళాశాల ప్రిన్సిపల్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వారోత్సవం

ప్రజాశక్తి-రామసముద్రం

వాల్మీకి మహర్షి జయంతి వారోత్సవంలో భాగంగా ఆదివారం మండలంలో వాల్మీకి జయంతిని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు దొడ్డిపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పిటిసి సిహెచ్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలను దేశంలోని 29 రాష్ట్రాలలో తెలుగు రాష్ట్రాలు తప్పా మిగిలిన అన్నీ రాష్ట్రాలలో వాల్మీకి బోయలను ఎస్‌సి, ఎస్‌టిలుగా పరిగణించబడుతున్నారని అన్నారు. గతంలో ఎపిని పరిపాలించిన నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం వాల్మీకులను బిసి -ఎ జాబితాలో చేర్చి నేటికి అరవై ఏళ్లు కావస్తోందన్నారు. దాదాపు నాలుగు తరాలు వాల్మీకిజాతి తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకులు ఎన్నో పోరాటాలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకులను ఎస్‌టి జాబితాలోకి తీసుకొస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం వాల్మీకి మహర్షి రథ యాత్రతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విఆర్‌పిఎస్ అధ్యక్షులు బుజ్జి, చలపతి, ఈశ్వర , రెడ్డెప్ప ,సింగల్ విండో అధ్యక్షులు కేశవరెడ్డి, కృష్ణా రెడ్డి, సిహెచ్ ప్రకాష్, గెవన్న, కత్తి వాలెప్ప, ఈశ్వర, బసప్ప, కేశవ , రాజశేఖర్ ,అద్దాల నాగరాజ, అంబరీష్, వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

పీలేరులో టిడిపి జెండా ఎగురవేస్తాం

ప్రజాశక్తి-కలికిరి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

పీలేరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేస్తామని రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు వాసునూరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి నిత్యం నియోజకవర్గ ప్రజలతో మమేకమై ప్రతిసమస్యకు పరిష్కార మార్గం చూపుతున్నారని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత మెజార్టీతో టిడిపి జెండా ఎగురవేస్తామని అన్నారు. ప్రస్తుతం వైసీపీ పాలనలో రాష్ట్రంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కనుమరుగు అవడంతో పాటు, రాష్ట్రంలో ప్రాజెక్టులు పడకవేయడంతో సాగు నీరులేక పండించిన పంట చేతికిరాక రైతులు అప్పుల ఊబిలో కూరుకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే సంక్షేమ అందుతుందన్నారు.

మహిళలకు చీరలు అందజేత

ప్రజాశక్తి-రామాపురం



మహిళలకు చీరలు అందజేస్తున్న రమేష్‌కుమార్‌రెడ్డి

టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడికోట భాస్కర్‌రెడ్డి తండ్రి గడికోట ఈశ్వర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సరస్వతిపల్లి గ్రామంలో మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పాల్గొని పేద మహిళలకు చీరెలు, పురుషులకు ప్రొత్సాహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అనంత పద్మనాభరెడ్డి, అన్నయ్య, శివయ్య, బాబు పాల్గొన్నారు.



మాధవిని సన్మానిస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

మహిళల అభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి -నందలూరు

మహిళల అభివృద్ధికి పాటుపడాలని నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. నందలూరు మండల వైసిపి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైన పల్లె మాధవిని ఆదివారం ఆమె స్వగృహంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. మహిళలు పార్టీలో ముందుండి నడిచేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వర్క్ బోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్. వైకాపా నాయకులు ఆకెపాటి రమేష్ రెడ్డి ఎం.దుర్గయ్య, నాగేంద్ర, నాయన పల్లి ఆదినారాయ, పవన్‌కుమార్, మట్టిబాబు, డేవిడ్ కళ్యాణ్ రాజ్ అక్కి వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన స్ఫూర్తి


ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న స్ఫూర్తి ఈనెల నాలుగవ తేదీన తిరుపతిలో జరిగిన ఎస్‌జిఎఫ్ అథ్లెటిక్ మీట్‌లో రెండవ స్థానం సాధించింది. త్వరలో గుంటూరు జిల్లా పల్నాడులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదన్‌మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా స్ఫూర్తిని పాఠశాల ఉపాధ్యాయులు, చైర్మన్, సర్పంచులు అభినందించారు.

టిడిపి, జనసేన విజయానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి-పీలేరు

నియోజకవర్గంలో జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం సమిష్టిగా కృషి చేయాలని నియోజకవర్గం జనసేనపార్టీ బాధ్యతలు బెజవాడ దినేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని కొండ్రెడ్డి గారిపల్లిలో జనసేన పార్టీ మండల అంతర్గత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధిష్టానం పిలుపు మేరకు టిడిపి మద్దతు అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో పైశాచిక ప్రభుత్వం గద్దె దిగేదాక పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. మండలంలో జనసేన పార్టీకి గట్టి పట్టు ఉందని, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత కూడా మనపై ఉందని చెప్పారు. ఈ సమావేశంలో పీలేరు మండల జనసేన పార్టీ ప్రెసిడెంట్ వి. మోహన్, జిల్లా కార్యదర్శి కలప రవి, సీనియర్ నాయకులు రెడ్డెప్ప, కార్యకర్తలు సునీత, షఫీ, గజేంద్ర, పవన్, ధనశేఖర్, గాయత్రి, హరీష్, గురుమోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దినేష్

పాఠశాలలో పారిశుధ్యం అధ్వానం

పజాశక్తి-ములకలచెరువు

మండలంలోని పాత ములకలచెరువు పంచాయితీ, పాత ములకలచెరువు ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. విద్యార్థులకు దోమలు బెడద ఎక్కువవుతోంది. పాఠశాల ఆవరణంలో వాటర్ ట్యాంక్‌లోని నీరు ఎల్లప్పుడు లీక్ కావడంతో పాఠశాల ఆవరణంలో నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు వృద్ధి చెందే పరిస్థితి ఏర్పడుతుంది. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు ఏపుగా విద్యార్థులకు ఇబ్బందికరంగా మారాయి. ప్రభుత్వం విద్యార్థులు అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నా కిందిస్థాయిలో అది అమలు కావడం లేదనే అభిప్రాయాన్ని విద్యార్థులు తల్లి దండ్రులు వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ఆవరణంలో ఉన్న చెత్తాచెదారంతోపాటు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పాఠశాల ఆవరణంలో పెరిగిన పిచ్చిమొక్కలు



మురికికూపాన్ని తలపిస్తున్న పాఠశాల ఆవరణం

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ గోపాలక్రిష్ణ

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ, తహశీల్దార్ భాగ్యలత పరిశీలించారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం అన్ని పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలోని కలికిరి, గుట్టపాలెం, మర్రిగుంటపల్లి గ్రామంలో డిప్యూటీ కలెక్టర్ గోపాల్ కృష్ణ, తహశీల్దార్ భాగ్యలత తనిఖీ చేసి అక్కడ సక్రమంగా కొత్త ఓటర్లు నమోదు కార్యక్రమం జరుగుతుందా, కొత్త ఓటరు లిస్టులో ఏమైనా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని యువకులందరినీ ఓటరు జాబితాలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒ విశ్వనాథ, గుట్టపాలెం విఆర్ఒ కదిరప్ప, బిఎల్ఒలు పాల్గొన్నారు.

8న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రామసముద్రం

కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక రామసముద్రం మండలంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం కోసం ఆనాడు 32 మంది ప్రాణ త్యాగాలు చేశారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలయ్య, రాజేష్ వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు. **సుండుపల్లి :** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నటువంటి బంధువులు జయప్రదం చేయాలని పిడి ఎస్‌యు విద్యార్థుల సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 మంది బలిదానాల తోటి సాధించుకున్న విశాఖ ఉక్కును తెగనమ్ముతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం నాడు జరిగిన పోరాటంలో విద్యార్థులు క్రియాశీలకంగా పోరా డారని, 32 మంది బలిదానాలతో, 67 మంది ప్రజా ప్రతినిధుల రాజీనామాలతో విశాఖ ఉక్కును సాధించు కున్నామని అన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలతో సహా వివిధ రాజకీయ పార్టీలు విశాఖ ఉక్కు పరి శ్రమ విషయంలో తమ స్టాండ్ తెలియజేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు అనుకూలంగా ఉండే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు.



నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

వైసిసికి దళితులు తగిన బుద్ధి చెప్పాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

వైసిపికి ప్రభుత్వానికి దళితులు బుద్దిచెప్పాలని, ఆసమయం ఎంతో దూరంలో లేదని పీలేరు నియోజకవర్గ టిడిపి ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కె.అగస్తీశ్వర్ అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్లలో దళిత యువకుడు శ్యామ్‌కుమార్ పై అగ్రవర్ణాల వారు విచక్షణా రహితంగా దాడిచేయడం పట్ల స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత యువకుడిని నాలుగు గంటల పాటు వాహనంలో తిప్పుతూ చిత్రహింసకు గురిచేయడం, తాగడానికి నీరు అడిగితే మూత్రం పోయడం లాంటి అకృత్యాల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుతంలో దళితులపై దాడులు ఆధికమైనా సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తు న్నారని ఆరోపించారు. ఇప్పటికే ప్రభుత్వం దళిత పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. విదేశీ విద్యా పథకాన్ని తుంగలోకి తొక్కేసిందని తెలిపారు. దళితుల పై జరుగుతున్న దమనకాండ ఇలాగే కొనసాగితే తగిన మూల్యం చెల్లించు తప్పదన్నారు.కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ వర్మ, మాలతి, అశోకుమార్, గోపి, రెడ్డి, రమణ, రాంబాబు, ఆంజమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైసిపి బస్సుయాత్రపై విమర్శలు తగవు

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి చేపట్టిన సామాజిక బస్సు యాత్రపై విమర్శలు తగవని, టిడిపి నాయకులు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని వైసిపి నాయకులు పేర్కొన్నారు. గత టిడిపి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీ వర్గాలకు అందించిన సహాయం శూన్యమని విమర్శించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వ హయాంలోఎస్‌సి, ఎస్‌టి, బిసి నాయకులకు కల్పిస్తూ గత ప్రభుత్వాల కంటే ఎక్కువగా మంత్రి పదవులు కల్పించారని తెలిపారు. బీసీలను బ్యాక్వర్డ్ క్యాస్ట్ గా కాకుండా బ్యాక్ బొన్ క్యాస్ట్‌గా గుర్తించడం జరిగిందని, గతంలో మైనారిటీలకు ప్రభుత్వం దిగేవరకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని చెప్పారు. యాత్రల పేరుతో ప్రజల్లో తిరిగి అల్లర్లు సృష్టించి ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోలీస్ వ్యవస్థలపై దాడికి దిగిన టిడిపి శ్రేణులను అరెస్టు చేయడం సరైనదేనని అన్నారు. కార్యక్రమంలో కలికిరి వార్డ్ నెంబర్ వేంపల్లి ఖాదర్‌బాషా, విశ్వనాథ, ఎసిపి సీనియర్ నాయకులు మద్దిరాళ్ల మల్లికార్జున, ఎంపిటిసి బోగేష్, వైసిపి మైనార్టీ నాయకులు హనీఫ్, వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా కన్వీనర్ భాను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి :'చమర్తి'



ప్రజలతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రాజు

ప్రజాశక్తి-సిద్ధవటం

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం రాజంపేట నియోజకవర్గ పరిధిలోని సిద్ధవటం మండలం, 11వ బెటాలియన్‌లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడుతో కలిసి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబు షురిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం ద్వారా చంద్రబాబు ప్రవేశపెట్టిన 6 సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను అందించామన్నారు. అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం, తల్లికి వందనం ద్వారా ఏడాదికి రూ 15 వేలు, మహాశక్తి పథకం ద్వారా ఆడబిడ్డ నిధి కింద రూ 15 వేలు చేయూత, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందివ్వనున్నట్లు తెలిపారు. ఆర్‌టిసి బస్సులో మహిళలందరికీ ఉచిత ప్రయాణం, ప్రత్యేకంగా బిసి రక్షణ చట్టం ద్వారా బిసిలకు అండగా నిలుస్తామన్నారు. మంచినీరు పథకం కింద ఇంటింటికి కులాయి కనెక్షన్, పూర్ టు రిచ్ ద్వారా పేదల ఆదాయం రెట్టింపు వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.' టిడిపి అధికారంలోకి రాగానే పథకాలను అర్హులైన వారు రిజిస్ట్రేషన్ కార్డు ద్వారా పొందవచ్చునని తెలిపారు.

రాయలసీమ ద్రోహి సిఎం జగన్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాయలసీమ ద్రోహి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాభావంతో లక్ష ఎకరాలు బీళ్లుగా మిగిలా యన్నారు. రబీలో కూడా అదే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కరువుపై సమీక్ష కూడా జరపలేకపోవడం అన్యా యమన్నారు. జిల్లాలోని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఐదు నెలలుగా తీవ్రత వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. కడప జిల్లాలోని 33 మండలాల్లో ఒక్కచుక్క కూడా వర్షం పడలేదన్నారు. ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం ముఖ్యమంత్రికి జిల్లా మీద ఎంత ప్రేమ ఉందో రైతులకు అర్థమవుతుందన్నారు. అలాగే అన్నమయ్య జిల్లాలో 30 మండలాలకు గాను 18 మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం ఎంతవరకు సమంజసమన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న విఆర్ఒ నరేంద్ర

హార్సిలీహిల్స్‌లో ఓటరు జాబితా ప్రచారం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్ర ప్రభుత్వం ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు చేపట్టే ఉద్దేశంతో స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేసింది. ఆదివారం మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో పోలింగ్ స్టేషన్ -200 పరిధిలోని ఓటరు జాబితాను విఆర్ఒ నరేంద్ర పరిశీలించారు. ఇందులో భాగంగా ఓటర్ల నుంచి అభ్యంతరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విఆర్ఒ నరేంద్ర మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే ఓటర్లు బిఎల్ఒలను సంప్రదించి సమస్యను పరిష్కరించు కోవాలన్నారు. చిరునామా, ఇంటి పేరు మార్చుకునే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

వీరబల్లి మండలం పుత్తావాండ్లపల్లెకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సిరిగిరి శ్రీనివాసులు రెడ్డి జన్మదినం సందర్భంగా విఆర్‌డిఎస్ ఆధ్వర్యంలో ఆసంస్థ ఛైర్మెన్ సురేంద్రారెడ్డి మండలంలోని బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం అనేది చాలా సంతృప్తిదాయకమని, వృద్ధుల పట్ల చిన్నచూపు చూడకుండా వారికి సేవ చేసినప్పుడే సమాజంలో సరైన గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తుమ్మల రమేష్, చలమా రెడ్డి, ఆశ్రమం మేనేజరు దేవనాథరెడ్డి, కోఆర్డినేటర్ ఏ.వి.సుబ్బయ్య పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న నాయకులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని విశ్రాంత ఉద్యోగ కలికిరి మండల అధ్యక్ష కార్యదర్శులు వేంపల్లి అబ్దుల్‌ఖాదర్, వై.ఆదినారాయణరెడ్డిలు తెలిపారు. ఆదివారం స్థానిక విద్యా వనరుల కేంద్ర ఆవరణలో ఎపిజిఆర్ఇ కలికిరి శాఖ సమావేశం అధ్యక్షులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ వై ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ అందరూ హెచ్ఎస్ సౌకర్యాలను వినియోగించుకోవాలని అన్నారు. వ్యవస్థాపక కార్యదర్శి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ నెలలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంఘ సభ్యులు ప్రజాసంక్షేమానికి సహాయ పడాలని కోరారు. సంఘానికి స్థలం కావాలని కలెక్టర్‌ను కోరామని ఉమ్మడిగా సాధించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు ఎం.సుబ్బరాజు శెట్టి, వై.కృష్ణారెడ్డి, అబ్దుల్ ఖాదర్, త్యనారాయణరావు, ఎం కాంతమ్మ,టి సరోజమ్మ, జి జయరాం,పి రామచంద్రయ్య పాల్గొన్నారు.

నేడు శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కలికిరి

పాలస్తీనాకు మద్దతుగా సోమవారం నిర్వహించే శాంతి ర్యాలీలో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ముస్లిం మైనార్టీ నాయకులు ముస్తఫా హజరత్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ నిర్వహిస్తున్న దాడులకు నిరసనగా కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. సోమవారం ఉదయం 10 గంటలకు జామియా మజీద్ వద్దకు వచ్చి అక్కడనుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాదరణ ఓర్వలేకనే చంద్రబాబుపై అక్రమ కేసులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆంధ్ర రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి విమర్శించారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని వలసపల్లె రోడ్డులో షాదీఖానా దగ్గర నుంచి ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ బాబుకు పజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు బనాయిస్తున్న ఈ సైకో ప్రభుత్వం దిగిపోవాలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో సైకో పోవాలి.. సైకిల్ రావాలి అనే నిదానంతో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. పనిచేసే కార్యకర్తను తెలుగుదేశం పార్టీ గుర్తిస్తుందని భరోసానిచ్చారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రతి గడప తిరుగుతూ వివరించారు. కరపత్రలను పంచుతూ స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంతో అందరి సమస్యలు పరిష్కరిస్తానని భూపేష్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఇంచార్జి జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బయపురెడ్డి, రమేష్‌రెడ్డి, నాగేశ్వరరావు, చాంద్, శివారెడ్డి, సేట్, టైలర్ మాబు, మల్లేష్, నాగరాజు, సూరి, సంజీవరెడ్డి, రామసుబ్బయ్య, సుబ్బారెండ్డి, మస్తాన్వలి, రఘు, వెంకటేష్, సాంబ, ఖాసీం వల్లి, గంగరాజు, నాగరాజు, రసూల్, మహీం ద్రా వర్మ, ప్రేమ్‌చంద్, వెంకటేష్, రామాంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

11న మాదిగల విశ్వరూప మహాసభ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకు ఈనెల 11న హైదరాబాద్‌లో జరప తలపెట్టిన మాదిగ, మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని దళిత సంఘాల నేతలు కోరారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ నుండి ఎమ్మార్పీఎస్ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దండోరా ప్రచార రథాన్ని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా దళిత నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ మంగ దొడ్డి సింగరయ్య, బిజెపి దళిత మోర్చా రాష్ట్ర నాయకులు మేకల ఆంజనేయులు, బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు నల్లప్ప పలువురు సంఘీభావం తెలిపారు.

క్రైం కార్నర్

ఆత్మహత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలో కేంద్రంలోని రామసముద్రంలో మహిళ ఆత్మహత్యకే కారకులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.చంద్రశేఖర్‌తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు విచారణలో మహిళ ఆత్మహత్యకు అదే గ్రామానికి చెందిన రెడ్డమ్మ, విజయ్‌కుమారి, కుమారీలుగా గుర్తించినట్లు తెలిపారు. ఇంటి స్థలం విషయంలో సూటిపోటి మాటలు అన్నారని, ఆ కారణంగా జ్యోతి విషం తీసుకొని చికిత్స పొందుతూ మృతి చెందినట్లు దర్యాప్తులో తేలడంతో నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.